
క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

విద్యార్హతలేకున్నా హెవీ డ్రైవింగ్ లైసెన్స్



మాట్లాడుతున్న ఆర్టీఓ సత్యనారాయణరెడ్డి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో లైట్ లైసెన్స్ కలిగి హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ అవసరమైన వారికి ఎలాంటి విద్యార్హత లేకున్నా మంజూరు చేస్తామని ఆర్టీఓ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి చదువు లేకున్నా ఎల్ఎల్ఆర్ హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ అందిస్తామన్నారు. టూ వీలర్, ఫోర్ వీలర్స్ లైసెన్స్‌ను కూడా ఎలాంటి చదువు అర్హతలేకుండా లైసెన్స్ మంజూరు చేస్తామని చెప్పారు. హెవీ వెహికల్ లైసెన్స్ కావాల్సిన వారు ఆర్టీఓను కలిసి దరఖాస్తులు అందించాలన్నారు. ఏజెంట్ల ద్వారా ఎవరూ రావద్దని, స్వయంగా లేదా మీసేవలో దరఖాస్తు చేసుకుని ఆర్టీఓ కార్యాలయానికి రావాలని సూచించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఉచితంగా రక్తపరీక్షలు చేశారు. గ్రామసచివాలయాల ఏఎన్ఎంలు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తం తక్కువగా ఉన్న విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ శివశంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య సాధనతోనే క్రీడల్లో రాణింపు



క్రీడాకారులతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచు

పాములపాడు: క్రీడాకారులు నిత్య సాధనతోనే క్రీడల్లో రాణించగలరని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మంది క్రీడాకారులు క్రీడా దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో తుమ్మలూరు విద్యార్థులు రాణిస్తుండటం సంతోషకరమన్నారు. క్రీడాకారులకు ఎంత వరకైనా సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు వరప్రసాద్, హెచ్ఎం బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు

జూపాడుబంగ్లా: బహిరంగ ప్రదేశాల్లో ఎవ్వరైనా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన కేజీ రోడ్డు వెంట, బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఎవ్వరైనా మద్యం సేవిస్తున్నట్లు తెలిస్తే వారిని ఉపేక్షించేదిలేదన్నారు.

సారా విక్రేత అరెస్టు

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామ శివారులో సారా విక్రయిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు నందికొట్కూరు పట్టణానికి చెందిన నీలిషికారి భారతి వీపనగండ్ల గ్రామ శివారులో నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- కృష్ణాపురం శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ
- ఆత్మకూరులో రామాలయ నిర్మాణ పనుల పరిశీలన

ఆత్మకూరు: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని పురాతన దేవాలయం జీర్ణోద్ధరణ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని దేవస్థానం ఈఓను ఆదేశించారు. అవసరమైతే మరిన్ని నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అంతకు మునుపు గ్రామస్తులు ఎమ్మెల్యేను భాజభజంత్రీల మధ్య ఆహ్వానించగా, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దేవాలయ పునర్నిమానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, శేషిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రమనరెడ్డి, ఈఓ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



పారచేతబట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామాలయ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు

ఆత్మకూరు పట్టణంలోని రామాలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని నిర్మాణంలో ఉన్న రామాలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రామాలయ నిర్మాణానికి సీపీఎఫ్ నుంచి రూ.10 లక్షల నుంచి రూ. 20లక్షలు అందిస్తామని ప్రకటించారు. ఇందుకు పట్టణప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం కొనసాగుతుంది. ఈ దేవాలయం కూడా అతిప్రాచీనమైనది కావడంతో పాటు శిథిలావస్థకు చేరడంతో జీర్ణోద్ధరణ చేపట్టారన్నారు. నిధులు కొరత లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే దేవస్థానం ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే వివాహదినోత్సవ వేడుకలు

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వివాహదినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



ఓపీ నమోదును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఛైర్ పర్సన్

ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటింటికి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ప్రారంభించారని, కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి శిబిరం వద్ద నిరుపేదలు వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్నారన్నారు. 11 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం వలన రోగాలు బయటపడుతున్నాయని, ఇందుకు వైద్యులు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు . మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆసియామారూఫ్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు., ప్రతి సచివాలయ పరిధిలో ప్రతి రోజూ ఆరు వందల నుంచి ఏడు వందల మంది వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే అంగన్‌వాడీ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్‌సభ్యులు రషీద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు జెడ్ శ్రీనివాస రెడ్డి ఇటీవల రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో ఎమ్మెల్యే శిల్పా గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు రఫిక్, రఫిక్ తల్లి మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమాల్లో ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఛైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్ సభ్యులు రషీద్, ఎంపీపీ తిరుపాలమ్మ, వైఎఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, జెడ్పీటీసీ శంకర్‌రెడ్డి, పువ్వాడ భాస్కర్, విజయ్, భోగిరెడ్డి, వెంకటస్వామి గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు



మమత

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీ పోటీలకు ఎంపిక కావడంతో కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు గురువారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు పట్టణంలోని అవుడోర్ స్టేడియంలో సెప్టెంబర్ 30న జరిగిన అండర్–19 బాలుర విభాగంలో తమ కళాశాలకు చెందిన మణి, పవన్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రాయచోటి జిల్లా రైల్వే కోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 9న నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలో ఈ క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో టైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్, పీడీ బ్రహ్మానందం, పీఈటీ దేవానందం, అధ్యాపకులు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బొల్లవరం హైస్కూల్ విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సాఫ్ట్‌బాల్ పోటీలకు డీపాల్ విద్యార్థిని..

పట్టణంలోని కరివేన డీపాల్ హైస్కూల్‌ల విద్యార్థిని మమత రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్‌జయ్‌సన్ చెప్పారు. ఈ నెల 4 నుంచి ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ కిడ్స్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు.

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బొల్లవరం ఎంపీయూపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రసాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం లక్ష్మీనరసమ్మ గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన శశికళ, అఖిల, జ్యోతి, సింధూజ, భరత్, రాంచరణ్ అనే విద్యార్థులు జూనియర్ జంప్ రోప్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, పీఈటీ రంగన్నను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా సమాధుల పండుగ



కొత్తపల్లిలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ ఫాదర్లు, క్రైస్తవులు

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రైస్తవ సోదరులు సమాధుల పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం రెవరెండ్ జాన్, ఉత్తమ్, క్రైస్తవులు సమాధులతోటకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధుల వద్ద ప్రార్థనలు చేసి పెద్దల ఆత్మకు శాంతి కలగాలని ఏసుక్రీస్తుని వేడుకున్నారు. ఈ సందర్భంగా సమాధులను పూలతో, కొవ్వత్తులతో అలంకరించారు.

కొత్తపల్లి: మండలంలో గురువారం క్రైస్తవులు ఆయా గ్రామాలలో సమాధుల పండుగను ఘనంగా చేసుకొన్నారు. మండలంలోని గువ్వలకుంట్ల, వీరాపురం, దుద్యాల, నందికుంట, లింగాపురం, శివపురం గ్రామాలలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో క్రైస్తవులు సమాధులను పూలమాలలు, ధూప,దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అన్యమతస్తులకు స్థలాలు, షాపులు కేటాయించొద్దు



ఈఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి అరవింద్‌రెడ్డి

శ్రీశైలం: క్షేత్రపరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దేవస్థానం పరిధిలో అన్యమతస్తులకు షాపులు, స్థలాలు, పాట్లు కేటాయించవద్దని కోరుతూ బీజేపీ జిల్లా కార్యదర్శి అరవింద్‌రెడ్డి గురువారం ఈఓకు వినతిపత్రం అందజేశారు. దేవస్థానంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు లోపాయకారి ఒప్పందాలు కుదుర్చుకుని అన్యమతస్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వారిని గుర్తించి సస్పెండ్ చేయాలని కోరారు. లలితాబజార్‌లోని జే, కే, ఎల్ బ్లాకుల మధ్య ఉన్న మరుగుదొడ్లను తొలగింపు ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. దేవస్థానం వేలంపాట ద్వారానే షాపులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే చొరవతో రూ.5వేలు పింఛన్ మంజూరు



వెంకటరమణకు రూ.5 వేల పింఛన్ అందజేస్తున్న గ్రామ నాయకులు, అధికారులు

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.5 వేల పింఛన్ మంజూరు కావడంతో లబ్ధిదారుడు ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు. బోయరేవుల గ్రామానికి చెందిన నాగనంది వెంకటరమణ పుట్టుకతోనే దివ్యాంగుడు. ఏ పని చేతకాకపోవడంతో పోషణ కష్టంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే రూ.3 వేల పింఛన్ సరిపోవడం లేదని గ్రామ మాజీ సర్పంచ్ ముంతల విజయభాస్కర్ రెడ్డి, వెలుగోడు సింగల్ విండో డైరెక్టర్ రమణ, శ్రీను నాగనంది వెంకటరమణ పరిస్థితిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డికి వినిపించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు రూ. 5000 పింఛన్ మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు నవంబర్ 1వ తేదీన నాగనంది వెంకటరమణకు రూ.5000 పింఛన్ అందచేశారు. దీంతో ఆయన కుటుంబం, గ్రామస్తులు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే 23 మందికి రూ.5 వేల పింఛన్లు మంజూరు చేయించారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

నంద్యాల వెళ్లి ..



హాస్పిటల్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీరాములు

మిడుతూరు: చౌట్కూరు గ్రామానికి చెందిన వితంతు పింఛన్ లబ్ధిదారురాలు వెంకటేశ్వరమ్మకు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ శ్రీరాములు గురువారం నంద్యాలకు వెళ్లి పింఛన్ అందజేశాడు. ఆపద సమయంలో హాస్పిటల్‌కు వెళ్లి పెన్షన్ అందజేయడం పట్ల లబ్ధిదారురాలు ఆనందం వ్యక్తం చేసింది.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు/ఆత్మకూరు: అంగన్‌వాడీ సహాయకుల (ఆయా) పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నందికొట్కూరు, ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓలు కోటేశ్వరమ్మ, లీలావతి కోరారు. ఈ మేరకు గురువారం వారు ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు విడుదల చేశారు. దరఖాస్తులు చేసుకునే మహిళలు 10వ తరగతి ఉత్తీర్ణులై, జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థినులు తప్పనిసరిగా వివాహితురాలై ఉండాలని,స్థానిక నివాసితురాలై ఉండాలని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించం

ఆత్మకూరు: విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దినేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 8న చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ విడుదల చేశారు.

ఆత్మకూరును కరువు డివిజన్‌గా ప్రకటించాలి

ఆత్మకూరు: డివిజన్ మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్‌లో 70 సంవత్సరాలు క్రితం వచ్చిన కరువు పరిస్థితులు ఈ ఏడాది మళ్లీ కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాబాషా, వీరన్న వెంకటేశ్వరరావు, స్వాములు, నరసింహులు పాల్గొన్నారు.

4న షిర్డీ సాయి విగ్రహ ప్రతిష్ఠ

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్‌లో ఈనెల 4న దత్తాత్రేయ స్వామి సహిత షిర్డీ సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు సాయివిజయ తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం గోపూజ, గణపతి, పుణ్యాహవాచనము, రక్షాబంధనము, అఖండ దీపస్థాపనం తదితర పూజా కార్యక్రమాలను రుత్వికులు జరిపించారు. 3న ఆవాహిత దేవతాపూజలు, దేవతా మూర్తులకు విశేషా మహాస్నపనము, ఆవాహిత దేవతా హోమాలు, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే 4న యంత్ర ప్రతిష్ఠ విగ్రహ ప్రతిష్ఠ, ప్రతిష్ఠ దేవతా మూర్తులకు పూజలు, మహా మంగళహారతి, అన్నదానం విశేషాది కార్యక్రమాలతో వేడుకలు ముగుస్తాయి.

నాదస్వర విద్వాంసుడు పుల్లయ్య మృతి తీరని లోటు

నందికొట్కూరు: నాదస్వర విద్వాంసుడు పుల్లయ్య మృతి తీరని లోటని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పగిద్యాల రోడ్డు బైరెడ్డి నగర్‌లో నివాసముంటున్న నాదస్వర విద్వాంసుడు, సువర్ణ నాదస్వర, హస్త కంకణ బిరుదాంకితులు పుల్లయ్య గురువారం మృతి చెందారు. ఆయన పార్థీవ దేహానికి మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలరు మంగళి కృష్ణ పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. పుల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్, లడ్డూ తదితరులు ఉన్నారు.

రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం అందించే రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం పుల్లయ్య సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పొదుపు సంఘాల సభ్యురాళ్లకు పీఎంఈజీపీ(ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరల్ ప్రోగ్రామ్) ద్వారా 35 శాతం రాయితీతో ఒక్కో సంఘానికి సుమారు రూ.10 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సప్లయర్ షాప్, వస్త్రాలయం, ఫ్లోర్ మిల్, తదితర వ్యాపారాల నిర్వహణకు కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వివరించారు.

కృత్రిమ అవయవాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

జూపాడుబంగ్లా: కృత్రిమ అవయవాలకోసం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 10న ఎల్లేన్ మెడోస్ ప్రాస్తెటిక్ హ్యాండ్ ఫౌండేషన్ అధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నారని చెప్పారు. చేతులు, కాళ్లు కోల్పోయిన వారు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధలు వారికి అవసరమైన ఎల్ఎస్ 4 కృత్రిమ అవయవాలకోసం 7207403150 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొన్న ఎల్ఎల్4 అవయవాలు ధరించటం వల్ల దివ్యాంగులు వారి పనులను స్వతహాగా చేసుకోగలుగుతారని తెలిపారు.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందనలు



బాక్సింగ్ క్రీడాకారుడు ఉపేంద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పట్టణానికి చెందిన జాతీయ స్థాయి బాక్సింగ్ క్రీడాకారుడు ఉపేంద్రను గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. అనంతరం క్రీడాకారుడు మాట్లాడుతూ తాను బాక్సింగ్ పోటీకి వెళ్లే సమయంలో ఎమ్మెల్యే తనయుడు శిల్పాకార్తీక్‌రెడ్డి చొరవతో ఆర్థిక సహాయం అందించారని, వారి ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: కర్నూలు–గుంటూరు, ఆర్అండ్ బీ ప్రధాన రహదారి వెంట ఉన్న దుకాణ దారులు, ఇంటి యజమానులు ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా ఉండేందుకు సహకరించాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఎస్ఐ అశోక్ కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానంగా బస్టాండ్ సెంటరులో రోడ్డు కిరువైపులా దుకాణాల ముందు ఏర్పాటు చేసిన రేకులను, మెట్లను తొలగించాలన్నారు. ఎవరి స్థలంలో వారు హద్దు మేరకు మాత్రమే నిర్మాణాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రోడ్డు ఇరుకుగా ఉండటడంతో వాహన చోదకులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. యజమానులందరూ సహకరించకపోతే తామే తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే అందరికి నోటీసులు పంపడం జరిగిందని తెలిపారు. త్వరితగతిన ఆక్రమిత నిర్మాణాలు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

స్థానిక రైతుల ప్రయోజనాలను కాపాడాలి



వీబీఆర్ వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: మండల రైతుల ప్రయోజనాలను కాపాడాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ కోరారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి మద్రాస్ కాల్వ నుంచి దిగువకు 3,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని విషయం తెలిసిన నాయకులు, రైతులు రిజర్వాయర్ వద్దకు చేరుకొని అధికారులతో మాట్లాడారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వీబీఆర్‌లో తగినంత నీరు లేదని, ఉన్న నీటిని దిగువకు విడుదల చేస్తే స్థానిక రైతులు నష్టపోతారన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు నీరు సరిపోదని, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచనల మేరకు వారాబందీ పద్ధతిలో నీటిని పొదుపుగా వాడుకుంటున్నామని చెప్పారు. మండల రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, వైస్ ఎంపీపీ చికెన్‌బాబు, ఎంపీటీసీ రాజేష్, నాయకులు కే.రామ్మోహన్ రెడ్డి, షంషీర్ అలీ, తెలుగు రమణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మహానంది: బొల్లవరం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న పాములేటిని అరెస్ట్ చేసి, పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేపట్టి పాములేటిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

ఆరుగురిపై బైండోవర్ కేసులు

మహానంది: గాజులపల్లెకు చెందిన ఆరుమందిపై గురువారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఇటీవల గాజులపల్లె, బుక్కాపురం, తిమ్మాపురం, అబ్బీపురం, సీతారామాపురం గ్రామాలకు చెందిన సుమారు ఇరవై మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

దేవస్థానం ఆసుపత్రికి మందుల విరాళం



మందులను అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న దేవస్థానం ఆసుపత్రికి హైదరాబాద్‌కు చెందిన చిలకల ఉపేందర్ రెడ్డి, కపిల్‌రెడ్డి రూ.2,12,000 లు విలువచేసే మందులను విరాళంగా అందజేశారు. ఈ మందులను ఏసీ వెంకటేశ్వర్లుకు, జి.మల్లికార్జునకు అందజేశారు.

మహానందీశ్వర దంపతులకు ఏకాంతసేవ పూజలు



ఏకాంతసేవ పూజలందుకున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు గురువారం రాత్రి ఏకాంతసేవ పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు శాంతారాంభట్, హనుమంతశర్మలు స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం యాగశాలలో శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య పూజలు చేశారు. భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్న అనంతరం పండితులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

మిడుతూరు: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం తనిఖీ చేసి విద్యార్థినులతో ప్రత్యక్షంగా సంభాషించారు. విద్యాలయంలో మౌలిక సదుపాలయాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనాథ్, కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ గురువారం తెలిపారు. ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో అన్నిశాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు పాల్గొని గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చించాలన్నారు.